ఆదోని డిపోకు అధికారులు కావలెను!

- డిపోలో డీఎంతో సహా ముఖ్య అధికారుల పోస్టులన్నీ ఖాళీ
- గాడితప్పుతున్న పాలన
- పనిభారం అంతా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పైనే
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రయాణికులు



ఆదోని టౌన్: ఆదోనిలో ఆర్టీసీ డిపోలో అధికారుల కొరతతో పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది. మేనేజర్‌తో పాటు ముఖ్య అధికారుల పోస్టులను ఖాళీగా ఉండటంతో ఏదైనా సమస్య తలెత్తితే ఎవరికి చెప్పుకోవాలో తెలియక సిబ్బందితో పాటు ప్రయాణికులు, విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో అతిపెద్ద డిపో

జిల్లాలో అతిపెద్ద డిపోగా ఆదోని ఆర్టీసీ డిపోలో పేరుగాంచింది. కలెక్షన్‌లోనూ చరిత్ర ఉంది. దీనికి అనుబంధంగా పత్తికొండ డిపో కూడా ఉంది. రెండింటి పరిపాలనా వ్యవహారాలు ఆదోని నుంచే సాగుతున్నాయి. అయితే డిపోలో ఉన్నతాధికారుల సీట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. అనారోగ్యంతో డీఎం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి నెలకుపైగానే అవుతోంది. అసిస్టెంట్ డిపో మేనేజర్ పోస్టు ఏడాదికిపైగానే ఖాళీగా ఉంది. సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల బదిలీ అయ్యారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా.. ఒకరే ఉన్నారు. డిపోలో అన్నిపనులూ ఆయనే నిర్వర్తించాల్సి వస్తోంది. దీంతో ఆయనపై పనిభారం పెరిగింది. అయితే కీలక నిర్ణయాలు తీసుకునే అధికారి లేకపోవడంతో డిపోలో ఏదేని సమస్య ఉత్పన్నమైతే పరిష్కరించే వారు కరువయ్యారు. డిపో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎమ్మిగనూరు డీఎంకు అప్పగించారు. దీంతో ఏ సమస్య వచ్చినా సిబ్బంది ఎమ్మిగనూరుకు పరుగుపెట్టాల్సిన పరిస్థితి.

డిపోలో 105 బస్సులు

ఆదోని ఆర్టీసీ డిపోలో 80 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. అద్దె బస్సులు 11 ఉండగా.. ఇటీవల కొత్తగా 14 బస్సులు వచ్చాయి. మొత్తం కలిపి 105 బస్సులు ఉన్నాయి. ఆదోని ఆర్టీసీ డిపోకు రోజు వారీ కలెక్షన్ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు వస్తుంది. వీటితో పాటు డిపోకు అనుబంధగా ఉన్న పత్తికొండ డిపోలో 26 బస్సులు ఉన్నాయి. ఇక్కడ రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల మేర కలెక్షన్ వస్తోంది.

గాడితప్పిన సమయపాలన

ఆదోని డివిజన్‌లో 297 గ్రామాలు ఉన్నాయి. సుమారు 15 లక్షల మేర జనాభా ఉంది. జనాభాకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే డిపో మేనేజర్ లేకపోవడం వల్ల అత్యవసరంగా బస్సులు కేటాయించాలన్నా, ఉత్సవాలకు అదనపు బస్సులు నడపాలన్నా బాధ్యత నిర్వర్తించాల్సిన అధికారి లేడు. అలాగే శుభకార్యాలకు ఎవరైనా బస్సులు బుక్ చేసుకోవాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు. పరిపాలన గాడితప్పడంతో రోజూ విద్యార్థినీ, విద్యార్థుల పాఠశాలలు, కళాశాలల వేళలకు అనుగుణంగా బస్సు సర్వీసులను నడపడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు బస్టాండు వద్ద, డిపోకు ఎదురుగా తరచూ ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినా వారి సమస్యలను పరిష్కరించేనాథులే లేరు. అదేవిధంగా సిబ్బందికి సెలవు కావాలన్నా, డ్యూటీ మార్చాలన్నా ఇబ్బందే. అంతేకాకుండా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే సిక్ లీవ్ కావాల్సి వస్తే సెలవుల మంజూరు కోసం ఎమ్మిగనూరుకు వెళ్లాల్సి వస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆదోని ఆర్టీసీ డిపో డీఎం సెలవుపై వెళ్లారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా, నేనొక్కడినే పని చేస్తున్నాను. ఎస్టీఐ కూడా ఇటీవలనే బదిలీ అయ్యారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. డిపో ఇన్‌చార్జిగా ఎమ్మిగనూరు డీఎంకు బాధ్యతలు అప్పగించారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఆదోని డిపోలో ఖాళీగా ఉన్న డీఎం, అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఉన్నతాధికారులు లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆదోని డిపోకు డీఎంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– రమణ, ఆర్టీసీ డ్రైవర్

క్లుప్తంగా

మతాలకు అతీతంగా మాబుసుభాని ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో మాబుసుభాని ఉరుసును కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. సోమవారం అర్ధరాత్రి తరువాత షబ్బీర్ తాత గంధాన్ని తీసుకుని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్వామి సమాధికి గంధోత్సవం నిర్వహించార. మంగళవారం గ్రామ ప్రజలు మాబుసుభాని దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై సమాచారం పొందే హక్కు ఉంటుందన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ఆదోని సెంట్రల్: సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదోని క్రీడాకారులు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఫిలిప్స్, కబడ్డీ టీం కోచ్ అమర్ ప్రకాశ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సతీష్, ఫస్ట్ ఇయర్ చదువుతున్న అవినాష్ జ్యోతిర్మయి కళాశాలలో చదువుతున్న జమ్మన్న పోటీలకు ఎన్నికయ్యారన్నారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు రాయలసీమ యూనివర్సిటీలో సౌత్ జోన్ నేషనల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

జాతీయస్థాయి క్రీడలకు విద్యార్థిని



క్రీడాకారిణి ముసాఖాన్‌తో ఉపాధ్యాయులు

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ ముసాఖాన్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచింది. గోల్ కీపర్‌గా వివిధ దశల్లో జరిగిన క్రీడల్లో రాణించింది. ఇటీవల సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయిలో కర్నూలు జట్టుకు ప్రాతినిధ్యం వహించి, ప్రతిభ చాటడంతో డిఫెన్స్, గోల్ కీపర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైంది. నవంబర్‌లో జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం హంపయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజ్, నరసింహరాజు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కోసిగి: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోసిగిలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాక నిరుపేద విద్యార్థులు ఫీజులు చెల్లించక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం మండల అధ్యక్షుడు అంజి, పురుషోత్తం, జానీ, ఏసురాజు, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ పనులు చేపట్టాలి

మంత్రాలయం : జిల్లా పశ్చిమ ప్రాంత రైతుల సౌకర్యార్థం వెంటనే రాజోళి బండ కుడి కాలువ (ఆర్డీఎస్) పనులు చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాలపల్లి రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్డీఎస్‌పై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు రాము నాయక్, దేవన్న, భాస్కర్, రుద్రప్ప, అన్వర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు సత్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయం వద్ద మంచినీరు, కూర్చోవడానికి కుర్చీలు, మరుగుదొడ్లు, వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, ఏఐకేఎంఎస్ నాయకులు రాజు, మనోజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఆదోని రూరల్: నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయి జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో క్వెస్ లిమిటెడ్ కంపెనీ, డోంట్ హాస్‌లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపుగా 80 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు. వీరిలో 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద్, స్కిల్ ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ, జిల్లా ఉపాధి కల్పనాశాఖ సిబ్బంది వై.పి.నరసింహులు, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్లు నరసప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అధిక మద్యం షాపులను మంజూరు చేసి మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలో జనావాసాల మధ్యన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక పెద్దబావి, కమిటీ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపులతో ఆప్రాంతంలోని మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటిని తక్షణం తొలగించాలన్నారు. సమావేశంలో సమాఖ్య నాయకులు నాగవేణమ్మ, ఉరుకుందమ్మ, వెంకటలక్ష్మి, సరోజ, ఈరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మున్సిపల్, పోలీసు అధికారుల పర్యటన



పట్టణంలోని కూడలిలో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, పట్టణ సీఐ

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్, పోలీసు శాఖలు సమన్వయంతో పట్టణంలో రాత్రి వేళలో పర్యటించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జామున 3గంటల వరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి సిబ్బందితో కలిసి పట్టణంలో కలియదిరిగారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు పలు కాలనీలు, వీధుల్లో పారిశుధ్య పనులు, మున్సిపల్ స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణలను పరిశీలించారు. అన్ని వీధులు, రహదారుల్లో కలియతిరిగి పోలీసు శాఖ పలు అంశాలపై తీసుకోవాల్సిన్న చర్యలు, వీధి దీపాలు, పశువులు, కుక్కలు ఎక్కువ సంచరించే ప్రాంతాలను గుర్తించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న కమిషనర్ ఎం. కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు అధికారుల దృషికి తీసుకొచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కరించి వారి మన్ననలు పొందాలన్నారు. మున్సిపాలిటీ అంటే అభివృద్ధికి కేరాఫ్‌గా నిలవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంఈ, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పి.సుజన తెలిపారు. మంగళవారం ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28న కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభను కనపరిచినట్లు తెలిపారు. అండర్–14 విభాగంలో కె.సి కప్యప్రియ, యం. మనిస్వి, అండర్–17 బాలుర విభాగంలో యు. గౌతమ్, బాలికల విభాగంలో ఎం.ఓం జాష్వి, బి.హర్షప్రియ ఎంపికయ్యారన్నారు. వీరు నవంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన వ్యాయమ ఉపాధ్యాయుడు నరసన్నను అభినందించారు.

పాండవగల్ చెరువు సమస్యను పరిష్కరించండి

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో నెలకొన్న పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని, అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్యకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న పెద్ద చెరువు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలాగే ఇంటి స్థలాల కోసం ఎవరైనా రైతులు భూమి అమ్మడానికి సిద్ధపడితే వారికి కూడా తగిన పరిహారం అందించి, ఇంటి స్థలాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.ఉమాదేవి, సీపీఎం మండల నాయకులు జె.రామాంజనేయులు, గ్రామశాఖ కార్యదర్శి గోవిందు, నాయకులు హనుమంతరెడ్డి, రమేష్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి



ఎల్లెల్సీ గట్టును పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రా రెడ్డి

గోనెగండ్ల : తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు కాలువల గట్లు దెబ్బతిని ఉన్నా, ఎస్కేప్ ఛానళ్లలో ఇతర పనులు ఏమైనా జరగాల్సి ఉన్నా ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని 4/7 టెల్‌డ్యామ్, ఎల్లెల్సీ ఎస్కేప్ ఛానల్, తుంగభద్ర దిగువ కాలువ గట్లు, జీడీపీ కుడి, ఎడమ కాలువల గట్లను ప్రాజెక్టు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే తాగునీటి పథకాలను పరిశీలించారు. కాలువ గట్ల వెంట సిమెంట్ లేచిపోవడం, గట్లు దెబ్బతినడం, చెట్లు మొలవడం గమనించారు. గట్లు దెబ్బతిన్న చోట పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ శైలేశ్వర్, ఎల్లెల్సీ డీఈ విద్యాసాగర్, ప్రాజెక్టు డీఈ విజయకుమార్, ఎల్లెల్సీ ఏఈ ఉదయ్ భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎన్‌సీసీని పునరుద్ధరించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీని పునరుద్ధరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ వీరేష్ మంగళవారం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కొంత మంది నిర్లక్ష్యం వలన పురపాలక పాఠశాలలో ఎన్‌సీపీని ఎత్తివేశారన్నారు. క్యాంపు నిర్వహించడానికి బెటాలియన్ శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు లేడని ఎన్‌సీసీని ఎత్తి వేయడం సరికాదన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం భార్య భర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. ఉదయం పొలం పనులకు వెళ్లి పొలంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పెద్దనేలటూర్‌లో 'పొలం పిలుస్తోంది'

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత పంటల బీమా, మినుముల మినీకిట్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలాలకు వెళ్లి పంటల గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



కీర్తన (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని నాగాలపురం గ్రామానికి చెందిన కీర్తన అనే 15 ఏళ్ల బాలిక సోమవారం సాయంత్రం 7గంటల నుంచి కనిపించడం లేదని బాలిక సోదరుడు దిబ్బన దొడ్డనగేరి శ్రీహరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల గాలించినా కనిపించడం లేదన్నారు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బదినేహాల్ విద్యార్థిని



రజియాతో వ్యాయామ ఉపాధ్యాయుడు

కౌతాళం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బదినేహాల్ జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రజియా ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు, వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహారాజు తెలిపారు. మంగళవారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రజియాను సన్మానించారు. వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి ఖోఖో అండర్–14 బాలికల విభాగంలో రజియా ఉత్తమ ప్రతిభ కనబరిచి వచ్చే నెల 7నుంచి 9 వరకు పల్నాడు జిల్లా కారంపూడిలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందన్నారు.

ఆగని వలసలు

ఆదోనిరూరల్: మండలంలోని పెసలబండ గ్రామంలో వలసలు ఆగడం లేదు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలస వెళ్లారు. పిల్లాపాపలతో మూటాముల్లె సర్దుకుని పయనమయ్యారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎస్ఈ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆదోని ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన అభివృద్ధి పనులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదోని డివిజన్ పరిధిలోని 14 మండలాల పరిధిలోని 289 గ్రామాల్లో సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, అవసరమైన చోట మురుగు కాలువలను ఏర్పాటు చేసేందుకు గాను ప్రభుత్వం రూ.38.53 కోట్లు విడుదల చేసిందన్నారు. ఉపాధిహామీ పథకం , మెటీరియల్ కాంపోనెంట్ పథకాల కింద ఈ నిధులు విడుదలయ్యాయన్నారు. 289 గ్రామాల్లో 436 అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనులను డిసెంబర్ ఆఖరులోగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెచ్.డి.ఈరన్న, డివిజన్‌లోని డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



శక్తినగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు

ఎమ్మిగనూరురూరల్: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని శక్తినగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అన్ని ఇళ్లలో సోదాలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐలు సుదర్శన్‌రెడ్డి, విక్రంసింహా, మంజునాథ్, గంగాధర్, ఎస్ఐలు డాక్టర్ నాయక్, శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి, వి. శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ఆదోనిరూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు పొందేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం స్పెషల్ సమ్మరీ రివిజన్–2025కు సంబంధించి రాజకీయ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎలక్షన్ ఉప తహసీల్దార్ గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్‌ను సబ్‌కలెక్టర్‌కు చూపుతున్న శ్రీనాథ్‌గుప్తా

శ్రీనాథ్‌గుప్తాకు సబ్‌కలెక్టర్ అభినందన

ఆదోని అర్బన్: సమాజ సేవకుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా ఇటీవల డాక్టరేట్ పొందారు. మంగళవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అవార్డు గ్రహీతను తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.

వర్మీకంపోస్టుతో పంచాయతీకి ఆదాయం



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నుర్జహాన్

గోనెగండ్ల : వర్మీకంపోస్టు ద్వారా ఆదాయాన్ని పెంచి పంచాయతీ అభివృద్ధి కృషి చేయాలని డీఎల్‌పీఓ నుర్జహాన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన తడిపొడి చెత్త నుంచి ఎరువులను తయారు చేసి పంచాయతీ ఆదాయం పెంచాలన్నారు. ఇప్పటికీ ఏ గ్రామంలోనైన చెత్త నుంచి సంపద తయారు కేంద్రాల షెడ్లు లేకుండా ఉంటే నవంబర్ 2వ తేదిన ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సతీష్, వెంకటేశ్వర్లు, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పునీత్ అభిమానుల అన్నదానం

ఆదోని అర్బన్: దివంగతం కన్నడ సినీ హీరో పునీత్ రాజ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం అభిమానులు ఆదోని పట్టణంలో అన్నదానం చేపట్టారు. సుమారు 600 మందికి అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సాయిభారతి స్కూల్ బి.దుర్గేష్, వాల్మీకి అశోక్‌కుమార్, విరూపాక్షి, ధనుంజయ, అల్తాఫ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలి

కౌతాళం: మండల కేంద్రంలో సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ గోపాల్‌కు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు,రవితేజ, శశిధర్, ఆమ్రేష్, నాగరాజు, మహేశ్‌లు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆదోని రూరల్: పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ హనుమన్న అనే వ్యక్తి 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. హనుమన్న ఇస్వీ కొండల్లో నుంచి నాటుసారా తయారు చేసుకుని ఆదోని పట్టణం వైపు వస్తుండగా జోడు బసవేశ్వరస్వామి దేవాలయం సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కనకవీడు విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందవరం : మండలపరిధిలోని కనకవీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం గౌరమ్మ, ఫిజికల్ డైరెక్టర్ ఈరన్న తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఎంపికై న విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ..కర్నూలు అవుట్ డోర్ స్టేడియం నిర్వహించిన జిల్లా స్థాయిలో హాకీ పోటీలలో అండర్ –17 విభాగంలో రవీంద్ర, అనసూయ, రూప, అండర్–14 విభాగంలో ప్రకాష్, శిరీష, శారదలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీఈటీ టీచర్ ఈరన్నను, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్ఞానప్రకాష్, విజయ్, రాము, కుమార్, నాగరాజు, వెంకటేశప్ప, దవల్లేశ్వరి, మీనాక్షి పాల్గొన్నారు.